క్లుప్తంగా

పార్టీ మరింత బలోపేతానికి కృషి

వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళా విభాగం ఉపాధ్యక్షురాలు నాగమణి



వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితో జమ్ములమడక నాగమణి

కాకినాడ రూరల్: రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ బలోపేతానికి శక్తి వంచన లేకుండా పనిచేస్తానని ఆ పార్టీ మహిళా విభాగం ఉపాధ్యక్షురాలు జమ్ములమడక నాగమణి తెలియజేశారు. తనకు పదవిని అందించిన పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, పార్టీ ఉత్తరాంధ్ర జిల్లాల రీజనల్ కో ఆర్డినేటరు కురసాల కన్నబాబు, ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ, జిల్లా పార్టీ అధ్యక్షుడు దాడిశెట్టి రాజా, పార్టీ మహిళా విభాగం అధ్యక్షురాలు వరుదు కళ్యాణిలకు ఆమె బుధవారం కృతజ్ఞతలు తెలిపారు. తన నియామకానికి సహకరించిన అందరికీ ఆమె ధన్యవాదాలు తెలిపారు.

పోటీతత్వం పెంచుకోవాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న ఇన్‌చార్జి సోషల్ వెల్ఫేర్ జేడీ శ్రీనివాసరావు

బోట్‌క్లబ్: పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులు పోటీ తత్వాన్ని అలవరచుకోవాలని ఇన్‌చార్జి సోషల్ వెల్ఫేర్ జేడీ జి.శ్రీనివాసరావు అన్నారు. ఆ శాఖ ఆధ్వర్యంలో స్థానిక శ్యామ్ ఇనిస్టిట్యూట్‌లో డీఎస్సీకి ఉచిత శిక్షణ పొందుతున్న ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులతో ఆయన మాట్లాడారు. సమయాన్ని వృధా చేసుకోకుండా వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. శ్యామ్ ఇనిస్టిట్యూట్ అధినేత గుంటూరు శ్యామ్ మాట్లాడుతూ నిరుద్యోగులకు ఉద్యోగసాధనకు అవసరమైన శిక్షణను అందిస్తున్నట్లు తెలిపారు.

భూ వాతావరణాన్ని కాపాడాలి

కాకినాడ రూరల్: అడవుల నరికివేత, భూ కాలుష్యం తదితర కారణాలతో వాతావరణంలో అనేక మార్పులు చోటు చేసుకుంటున్నాయని వికాస తరంగిణి రాష్ట్ర కోఆర్డినేటర్ ఉషశ్రీ పేర్కొన్నారు. స్థానిక బోట్‌క్లబ్ ఉద్యానవనంలో వికాస తరంగిణి కాకినాడ శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ ధరిత్రి రక్షిత దినోత్సవాన్ని పురస్కరించుకుని అవగాహన కార్యక్రమం నిర్వహించారు. క్లోరినేటెడ్ ప్లాస్టిక్‌తో మట్టిలో విష రసాయనాలు చేరుతున్నాయని, అడవులు నరకడం వల్ల ఎండలు కాక రేపుతున్నాయన్నారు. దీనిని అధిగమించడానికి మొక్కలను విరివిగా నాటాలని, ప్లాస్టిక్ సంచుల స్థానే వస్త్ర సంచులను వినియోగించాలని తెలిపారు. కార్యక్రమంలో వాకర్స్ సంఘ అధ్యక్షులు అడబాల రత్న ప్రసాద్, కార్యదర్శి డాక్టర్ దాసరి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు రేపు అంతరాయం

బోట్‌క్లబ్: విద్యుత్ వార్షిక మరమ్మతుల దృష్ట్యా శుక్రవారం ఉదయం 9.30 నుంచి 11.30 గంటల వరకు 33/11 కేవీ అన్నమ్మఘాటీ విద్యుత్ ఫీడర్ పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్‌శాఖ కాకినాడ డివిజన్ ఏఈ ఎస్.ఉదయభాస్కర్ తెలిపారు. అన్నమ్మ ఘాటీ విద్యుత్ ఉపకేంద్రం పరిధిలోని నరసింహ రోడ్, శివాలయంవీధి, తారకరామనగర్, ఘాటీసెంటర్, కొవ్వూరు రోడ్, కొవ్వూరు గ్రామం, తూరంగి, సుందర నగర్, పప్పులమిల్లు ప్రాంతం, రిక్షాలపేట, పరదేశమ్మపేట, ప్రసాదరావు నగర్, సత్యదేవి నగర్, ముగ్గుపేట, రెల్లిపేట, బాపూజీనగర్, పద్మనాభ నగర్, మేకానారాయణమ్మతోట, కాపులవీధి, మున్సిఫ్ జంక్షన్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

నేటి నుంచి బీఎస్సీ నర్సింగ్ పరీక్షలు

కాకినాడ క్రైం: కాకినాడ రంగరాయ వైద్య కళాశాలలో నేటి నుంచి బీఎస్సీ నర్సింగ్ పరీక్షలు జరగనున్నాయి. వచ్చే నెల 10వ తేదీ వరకు జరగనున్న ఈ పరీక్షలను ఆర్ఎంసీ ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. థర్డ్ ఇయర్, ఫోర్త్ ఇయర్‌తో పాటు పోస్ట్ బేసిక్ విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరుకానున్నారు. ఆర్ఎంసీ ఎగ్జామినేషన్ హాల్‌లో ఉదయం 10 గంటల నుంచి ఒంటిగంట వరకు జరగనున్న ఈ పరీక్షలకు కాకినాడ జిల్లాకు చెందిన 8 నర్సింగ్ కళాశాలల నుంచి 4000 మంది హాజరుకానున్నారు. ఆర్ఎంసీ వైద్యులు ఇన్విజిలేటర్లుగా వ్యవహరిస్తారు.

నవోదయలో ఎన్‌సీసీ శిక్షణ శిబిరం

పెద్దాపురం: స్థానిక జవహార్ నవోదయ విద్యాలయలో ఎన్‌సీసీ వార్షిక శిక్షణ శిబిరంలో భాగంగా బుధవారం వాలీబాల్, రైఫిల్ షూటింగ్ శిక్షణ ప్రారంభమైంది. ఈ సందర్భంగా బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్, క్యాంప్ కమాండెంట్ మేజర్ కె.మహ్మద్ హాఫీజ్ మాట్లాడుతూ 18వ బెటాలియన్ కాకినాడ ఆధ్వర్యంలో ఈ నెల 30వ తేదీ వరకు శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఎన్‌సీసీతో క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, దేశభక్తితో పాటు సమాజంలోని సమస్యలపై అవగాహన పెరుగుతాయన్నారు.

మొదటి మెట్టులో మెరుపులు

- మునిసిపల్ పాఠశాలల్లో 82 శాతం ఉత్తీర్ణత
- కరపలో 81.2 శాతం..
- రూరల్ మండలంలో 65.39 శాతం నమోదు

కరప: మండలంలో పదవ తరగతి పరీక్షల్లో 81.2 శాతం ఉత్తీర్ణత సాధించినట్టు ఎంఈఓలు కె.బుల్లికృష్ణవేణి, పి.సత్యనారాయణ బుధవారం తెలిపారు. మండల పరిధిలో జెడ్పీ ఉన్నత పాఠశాలలతో పాటు, మహాత్మ జ్యోతిబాపూలే వెనుగకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యాలయం విద్యార్థులతో కలిపి ఈ యేడాది 765 మంది పదో తరగతి పరీక్షలు రాయగా 621 మంది పాసై 81.2 శాతం ఉత్తీర్ణత సాధించారు. వీరిలో బాలికలు 364 మందికి 309 మంది పాసై 84.9 శాతం, బాలురలో 401 మందికి 312 మంది పాసై 77.8 శాతం ఉత్తీర్ణత సాధించారు. కరప, అరట్లకట్ట, వేములవాడ, వేళంగి, కూరాడ, పెద్దాపురప్పాడు, గొర్రిపూడి, నడకుదురు, గురజనాపల్లి ఉన్నత పాఠశాలలకు 7 పాఠశాలల్లో బాలికలే స్కూలు ఫస్ట్ రావడం విశేషం. మహాత్మ జ్యోతిబాపూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యాలయం 92.7 శాతం ఉతీర్ణత సాధించింది. ఈ పాఠశాలల్లో 55 మంది పరీక్షలు రాయగా 51 మంది ఉత్తీర్ణత సాధించారు. వీరిలో డి.చంద్రశేఖర్ 557 మార్కులతో గురుకుల విద్యాలయం ఫస్ట్ సాధించాడు. పెద్దాపురప్పాడు బిరుదా సూర్యనారాయణ (ఫకీర్రావు) జెడ్పీ ఉన్నత పాఠశాల 96.5 శాతంతో మండలంలో ప్రథమస్థానం సాధించగా, వేళంగి మెర్లాస్ జెడ్పీ ఉన్నత పాఠశాల 54.5 శాతంతో చివరి స్థానంలో నిలిచింది. అరట్లకట్ట హైస్కూలులో 61 మందికి 57 మంది పాసై 93.4 శాతం ఉత్తీర్ణత సాధించింది. తోట లోకేష్ 585 మార్కులతో స్కూలు ఫస్ట్, నక్కా దుర్గాగౌతమ్ (546), కె.రూపాదేవి (526), కె.సంతోష్(526) ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. నడకుదురు హైస్కూలులో 38 మందికి 29 మంది పాసై 76.3 శాతం ఉత్తీర్ణత సాధించింది. సీహెచ్ భానుశ్రీ 541 మార్కులతో స్కూలు ఫస్ట్ సాధించింది. కరప నక్కా సూర్యనారాయణమూర్తి జెడ్పీ ఉన్నత పాఠశాలలో 157 మందికి 123 మంది ఉత్తీర్ణులై 78.3 శాతం రాగా దేవిశెట్టి రమ్యశ్రీ రత్నమణి 580 మార్కులతో స్కూలుఫస్ట్, నున్న తేజ దుర్గాభవాని (573), కనకం సంధ్య(571) సెకండ్, థర్డ్ వచ్చారు. గొర్రిపూడి హైస్కూలులో 90 మందికి 81 మంది పాసై 90 శాతం ఉత్తీర్ణత సాధించగా, తలారి లావణ్య 577 మార్కులతో స్కూలు ఫస్ట్, ఎర్రంనీడి సరస్వతీదేవి (575), సత్తినీడి విమలాదేవి(573) తరువాతి స్థానాలు సాధించారు. వేములవాడ హైస్కూలులో 28 మందికి 17 మంది పాసై 60.7 శాతం ఉత్తీర్ణత సాధించగా వి.తనూజ నాగలక్ష్మి 571, ఎం.ఫిలేమాన్ (545), సీహెచ్ భవ్య (544) మొదటి మూడు స్థానాలు సాధించారు. కూరాడ హైస్కూలులో 34 మందికి 23 మంది పాసై 67.6 శాతం ఉత్తీర్ణత రాగా, బండారు హాసిని 563 మార్కులతో స్కూలు ఫస్ట్, మాకన స్వాతి (561), పబ్బినీడి నాగజోషిణి (544) సెకండ్, థర్డ్ వచ్చారు. వేళంగి హైస్కూలులో 112 మందికి 61 మంది పాసవ్వగా 54.5 శాతం ఉత్తీర్ణత వచ్చింది. పేరెళ్ల సుధీర్‌కుమార్ 582 మార్కులతో స్కూలు ఫస్ట్, కర్నాసుల సాయిశ్రీ సౌదామిని లక్ష్మీ కృష్ణ(578), జీలకర్ర నాగసాయి ఆదిత్య(571) సెకండ్, థర్డ్ వచ్చారు. పెద్దాపురప్పాడు బిరుదా సూర్యనారాయణ (ఫకీర్రావు) జెడ్పీ పాఠశాలలో 114 మందికి 110 మంది పాసై 96.5 శాతం ఉత్తీర్ణత రాగా, సలాది రేఖాధనశ్రీ 581 మార్కులతో స్కూలు ఫస్ట్, వీఎస్‌హెచ్ వైష్ణవి (560), ఎస్.సత్యదుర్గాభవాని (554) సెకండ్, థర్డ్ వచ్చారు. గురజనాపల్లి పబ్బినీడి పాపారావు జెడ్పీ ఉన్నత పాఠశాలలో 76 మందికి 69 మంది పాసవ్వగా 90.8 శాతం ఉత్తీర్ణత సాధించింది. వీరిలో జీఎస్ఎల్ ప్రసన్న 561 మార్కులతో స్కూలు ఫస్ట్, పి.గంగా హారిక (537), ఎంఎన్‌వీఎస్ఎస్ జ్యోష్ణవి (532) మార్కులతో ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు.



అరట్లకట్ట హైస్కూలులో స్కూలు, మండలం ఫస్ట్‌వచ్చిన విద్యార్థి తోట లోకేష్ (585), తల్లిదండ్రులను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు, గ్రామస్తులు

అరట్లకట్ట విద్యార్థికి మండలం ఫస్ట్

అరట్లకట్ట హైస్కూలులో స్కూలు, మండలం ఫస్ట్ వచ్చిన తోట లోకేష్‌ను, తల్లిదండ్రులను హెచ్ఎం డాక్టర్ పీవీ శివగిరి, ఎస్ఎంసీ చైర్మన్ ధార వీరబాబు, సర్పంచ్ గోపి సత్యవేణి తదితర గ్రామస్తులు సత్కరించారు. అలాగే భవిత పాఠశాలలో ప్రత్యేక అవసరాలు గల పిల్లలు 6 గురు పదో తరగతి పరీక్షలు రాయగా ఐదుగురు పాసైనట్టు మండల ఐఆర్టీ కె.స్వాతి, ఎన్.మల్లేశ్వరి తెలిపారు.



పేరెళ్ల సుధీర్‌కుమార్ (582), మండలం సెకండ్, వేళంగి హైస్కూలు



సలాది రేఖా ధనశ్రీ (581), మండలం థర్డ్, పెద్దాపురప్పాడు హైస్కూలు



దేవిశెట్టి రమ్యశ్రీరత్నమణి (580), మండలం ఫోర్త్, కరప హైస్కూలు



జీఎస్ఎల్ ప్రసన్న (561), గురజనాపల్లి హైస్కూలు



వి.తనూజ నాగమహాలక్ష్మి (571), వేములవాడ హైస్కూలు

మున్సిపల్ విద్యార్థుల విజయ భేరి

బాలాజీచెరువు: నగర వ్యాప్తంగా మున్సిపల్, ఎయిడెడ్ పాఠశాలలు 24 ఉండగా ప్రైవేట్ స్కూల్స్ 44 వరకూ ఉన్నాయి. గత ఏడాది 82.47 శాతం ఉత్తీర్ణత సాధించగా ఈ ఏడాది 82 శాతంతో సరిపెట్టుకుంది. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల నుంచి 5,107 మంది హాజరు కాగా 4,211 ఉత్తీర్ణత సాధించారు. ప్రభుత్వ పాఠశాలల నుంచి 2,280 మంది హాజరు కాగా 1633 మంది ఉత్తీర్ణులయ్యారు. ప్రైవేట్ పాఠశాలల నుండి 2,827 మంది హాజరు కాగా 2,578 మంది ఉత్తీర్ణులయ్యారు. స్థానిక శ్రీనగర్ అడ్వాన్స్‌డ్ ఫౌండేషన్ కోర్సు నగర పాలక సంస్థ విద్యార్థి లావణ్య 586 మార్కులతో నగర టాపర్‌గా నిలవగా సాలిపేట బాలికల పాఠశాల విద్యార్థి ఎస్.వివేక సాయి తేజస్విని 584 మార్కులు సాధించారు. ఎంఈఓ చెవూరి రవి విద్యార్థులను అభినందించారు.

దక్ష విద్యార్థుల ప్రతిభ

పదో తరగతి పరీక్ష ఫలితాల్లో సురేష్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ దక్ష స్కూల్ విద్యార్థులు నూరుశాతం ఉత్తీర్ణత సాధించారని పాఠశాల డైరెక్టర్ యర్రంశెట్టి సురేష్ బుధవారం తెలిపారు. ఎం.గోకుల్‌సాయి సుహాస్ 588, ఎం.లావణ్య 585తో పాటు 550కు పైగా మార్కులను విద్యార్థులు సాధించారన్నారు.

శ్రీచైతన్య ప్రతిభ...

శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులు నూటికి నూరుశాతం ఉత్తీర్ణత సాధించారని పాఠశాల ఆర్ఐ గోపీనాథ్ తెలిపారు. 595కు పైగా 4గురు, 590కి పైగా 23 మంది, 580కు పైగా 77మంది ప్రతిభ చాటారని తెలిపారు. శాంతినగర్ బ్రాంచ్ నుంచి 540కు పైగా ఐదుగురు, 550కు పైగా 79 మంది, 500కు పైగా 141మంది ప్రతిభ చాటారన్నారు. విద్యార్థులను ప్రిన్సిపాల్ సుల్తానా, డీన్ నవీన్‌కుమార్ అభినందించారు.

పండూరు, తమ్మవరం పాఠశాలల్లో శతశాతం..

కాకినాడ రూరల్: పదో తరగతి ఫలితాలలో బాలికలు మెరిసారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో 65.39 శాతం ఉత్తీర్ణత నమోదైంది. మొత్తం 1251 మంది పరీక్షకు హాజరు కాగా 818మంది పాస్ అయ్యారు. ప్రైవేట్ స్కూల్స్‌కు సంబంధించి 93.57 శాతం ఉత్తీర్ణత నమోదయ్యింది. మొత్తం 1182 మంది విద్యార్థులకు 1106 మంది పాసయ్యారు. ప్రభుత్వ పాఠశాల్లో పండూరు, తమ్మవరం పాఠశాలలు నూరు శాతం ఉత్తీర్ణత సాధించాయి. పండూరు జెడ్పీ హైస్కూల్‌లో 54 మందికి 54 మంది ఉత్తీర్ణులవగా, అత్యధికంగా యల్లంకి రూపాదేవి 588 మార్కులు, పి.వేనుక 585 మార్కులు, సాయి అన్విత 579 మార్కులు సాధించారు. తమ్మవరం హైస్కూల్‌లో 34 మందికి అందరూ పాస్ అయ్యారు. కాగా రమణయ్యపేటలోని ఏపీ ఎస్పీ జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని వెంటూరి బేబీ స్వరూప 581 మార్కులు సాధించింది. పాఠశాలలో 231 మందికి 71శాతం ఉత్తీర్ణతతో 164 మంది పాస్ అయ్యారు. 500 మార్కులు పైబడి 24 మంది సాధించారు. విద్యార్థినులు నల్ల చంద్రిక 567 మార్కులు, సరగడ లక్ష్మి సాహితీ 561 మార్కులు సాధించినట్టు హెచ్ఎం గాయత్రి తెలిపారు. మండలంలోని పి.వెంకటాపురంలోని డాక్టరు బీఆర్ అంబేడ్కర్ బాలిక గురుకుల పాఠశాలలో విద్యార్థినులు 97.4 శాతం ఉత్తీర్ణత సాధించారు. 75 మందికి 73 మంది పాస్ అయ్యారు. వీరిలో అత్యధికంగా శీలి ప్రైజీ 572 మార్కులను, శీలి సుచిత్ర 567 మార్కులు సాధించినట్టు ప్రిన్సిపాల్ సుశీల తెలియజేశారు.



కాకినాడ రూరల్‌లో 588 మార్కులు సాధించిన యల్లంకి రూపాదేవి



పండూరులో 585 మార్కులు సాధించిన వేనుక



ఏపీఎస్పీ జెడ్పీ హైస్కూల్‌లో 581 మార్కులు సాధించిన వెంటూరి బేబీ స్వరూప



శీలి ప్రైజీ



శీలి సుచిత్ర

గురుకుల పాఠశాలలో 97.4 శాతం ఉత్తీర్ణత

ఉగ్రదాడికి నిరసనగా శాంతి ర్యాలీ



కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్న బీజేపీ నాయకులు

కాకినాడ రూరల్ : జమ్ము కాశ్మీర్‌లో ఉగ్రదాడికి నిరసనగా స్థానిక సర్పవరం జంక్షన్‌లో బీజేపీ అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ పితాని లీలావతి ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ నిర్వహించారు. పార్టీ పార్లమెంట్ కన్వీనర్ రంబాల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ భారతదేశ ఉన్నతిని చూసి తట్టుకోలేక పాకిస్తాన్ ఇటువంటి దుశ్చర్యలకు ప్రోత్సహిస్తోందని అన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

తీవ్రవాదులది పిరికిపంద చర్య

బోట్‌క్లబ్: పహల్గాంవ్‌లో అమరులైన వారి ఆత్మశాంతి కోరుతూ బుధవారం రాత్రి బీజేపీ జిల్లా అధ్యక్షులు బిక్కిన విశ్వేశ్వరావు ఆధ్వర్యంలో కార్యకర్తలు, నాయకులు కొవ్వత్తుల ర్యాలీ నిర్వహించారు. స్థానిక జెడ్పీ సెంటర్ నుంచి అమరవీరుల స్థూపం వరకూ ఈ ర్యాలీ నిర్వహించారు. ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు వేటుకూరి సూర్యనారాయణరాజు, నాయకులు పాల్గొన్నారు.

న్యాయవాదుల సమస్యలు పరిష్కరిస్తా

- బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏలూరి
- నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారం



సమావేశంలో మాట్లాడుతున్న బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సుబ్రహ్మణం, పాల్గొన్న నూతన కార్యవర్గ సభ్యులు

కాకినాడ లీగల్: న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కాకినాడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏలూరి సుబ్రహ్మణ్యం అన్నారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో విజయం సాధించిన కార్యవర్గ ప్రమాణస్వీకారం బుధవారం జరిగింది. అధ్యక్షుడు సుబ్రహ్మణం మాట్లాడుతూ బార్ అసోసియేషన్‌కు 150 ఏళ్ల పూర్తయిన సందర్భంగా వేడుకలు చేసుకున్నారు. అంతకు ముందు బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు ముత్తింటి విశ్వేశ్వరరావు, కొత్తగా ఎన్నికైన అధ్యక్షుడికి బాధ్యతలు అప్పగించారు.

నూతన కార్యవర్గం

కాకినాడ బార్ అధ్యక్షుడిగా ఏలూరి సుబ్రహ్మణ్యం, ప్రధాన కార్యదర్శిగా చెక్కపల్లి వీరభద్రరావు (చంటి), ఉపాధ్యక్షుడిగా పెన్మెత్స రామచంద్రరాజు, కోశాధికారిగా కోకా వెంకట కృష్ణారావు, సహ కార్యదర్శిగా బండి నరేంద్ర, గ్రంథాలయ కార్యదర్శిగా మేడపాటి రామారెడ్డి, క్రీడా సాంస్కృతిక కార్యదర్శిగా జోకా వీఎస్ విజయకుమార్, మహిళా ప్రతినిధిగా జి.దివ్య శ్రీ విద్య, మహిళా కార్యవర్గ సభ్యురాలిగా కె.శ్రీవాణి, సూపర్ సీనియర్ కార్యవర్గ సభ్యుడిగా వేగుళ్ల వెంకట రమణమూర్తి, సీనియర్ కార్యవర్గ సభ్యులుగా నక్కా సంజీవ్ కుమార్, జూనియర్ కార్యవర్గ సభ్యులుగా మర్ల ప్రవల్లిక, గుత్తుల మంగరాజు,షేక్ ప్రేమ్ నజీర్, దుళ్ల నాగబాబు ప్రమాణస్వీకారం చేశారు. నూతన కార్యవర్గాన్ని న్యాయవాదులు సత్కరించారు.

ఉగ్ర దాడికి నిరసన



రావివారిపోడులో కొవ్వొత్తుల ప్రదర్శన చేస్తున్న ప్రజలు

కొత్తపల్లి: జమ్ము కాశ్మీర్‌లోని పెహల్‌గాంలో జరిగిన ఉగ్రవాద దాడిని ఖండిస్తూ మండలంలోని పొన్నాడ శివారు రావివారిపోడులో బుధవారం రాత్రి కొవ్వొత్తుల ప్రదర్శన చేశారు. మహాలక్ష్మి అమ్మవారి ఆలయం వద్ద నుంచి గ్రామంలో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. పర్యాటకులపై దాడి చేయడం దారుణమన్నారు. ఇటువంటి దాడి హేయమైన పిరికిపందల చర్యగా అభివర్ణించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మాజీ మండల వ్యవసాయ కమిటీ చైర్మన్ జ్యోతుల బాబు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఉజ్జయినీ మహంకాళి విగ్రహ ప్రతిష్ఠ



ఆలయంలో హోమం చేస్తున్న సర్పంచ్ దంపతులు

సామర్లకోట: మండలం నవర గ్రామంలో సుమారు రూ.70 లక్షలతో గ్రామ సర్పంచ్, వైఎస్సార్ సీపీ నాయకుడు దమ్మాల లక్ష్మణరావు, వీరనాగమణి దంపతులు నిర్మించిన ఆలయంలో బుధవారం ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ వైభవంగా జరిగింది. నవరత్న న్యాసం, నవధాన్య న్యాసం, యంత్ర ప్రతిష్ఠ, విగ్రహ ప్రతిష్ఠ, శిఖర ప్రతిష్ఠ, హోమం, పూర్ణాహుతి, ప్రాణ ప్రతిష్ఠ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. వేదపండితులు వింజమూరి సత్యనారాయణ మూర్తి, దమ్మాల లక్ష్మణరావు, వీరనాగమణి దంపతులచే కార్యక్రమాలు చేయించారు. అనంతరం భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారిని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ దవులూరి దొరబాబు బుధవారం దర్శించుకున్నారు. ఆయన వెంట పార్టీ నాయకులు దవులూరి సుబ్బారావు, నాగనబోయిన రాజబాబు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కొత్తపల్లిలో కలెక్టర్ పర్యటన

కొత్తపల్లి: మండలంలోని ఉప్పాడలో కలెక్టర్ షన్మోహన్ బుధవారం పర్యటించారు. ఉప్పాడలో నిర్మించనున్న కల్యాణ మండప శంకుస్థాపనకు శుక్రవారం ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ రానున్నారు. దేవదాయ, టీటీడీ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న ఈ మండపాన్ని పరిశీలించి పలు సూచనలు ఇచ్చారు. ఆయనతో పాటు జిల్లా ఎస్పీ ఉన్నారు.

మహిళ మెడలో గొలుసు చోరీ

కరప: మహిళ మెడలో పుస్తెల తాడు, నల్లపూసలను ఓ దుండగుడు లాక్కుని వెళ్లిన ఘటన మండలం వేళంగిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు కోనసీమ జిల్లా అయినవిల్లికి చెందిన అబ్బిరెడ్డి వరలక్ష్మి ఈనెల 20వ తేదీన కరప మండలం సిరిపురం గ్రామంలోని బంధువుల ఇంటికి వచ్చింది. అక్కడి నుంచి ఆమె బుధవారం ఉదయం దొంతమూరులోని బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి రావడానికి వేళంగిలో బస్సు దిగింది. సిరిపురం రావడానికి వేళంగిలో బస్సు దిగారు. అక్కడి నుంచి ఆమె తల్లి వెంకటలక్ష్మితో కలసి నడచి వస్తుండగా గుర్తు తెలియని వ్యక్తి వాహనంపై వెళ్తూ ఆమె మెడలోని 32 గ్రాముల పుస్తెలతాడు, బంగారు నల్లపూసలు లాక్కుని పరారయ్యాడు. ఎస్ఐ టి.సునీత కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గ్రామస్తులు సంయమనం పాటించాలి

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వంగా గీత



మల్లాంలో బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న వంగా గీత, వైఎస్సార్ సీపీ నేతలు

పిఠాపురం: మండలం మల్లాంలో రెండు వర్గాల మధ్య నెలకొన్న వివాదంలో అందరూ సంయమనం పాటించాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వంగా గీత కోరారు. బుధవారం ఆమె మల్లాంలో పర్యటించి ఇటీవల విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందిన సురేష్‌బాబు కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం కొన్ని విషయాలు బయటకి వచ్చాయని అటువంటి సంఘటనలు చోటు చేసుకోకుండా జిల్లా అధికారులు చర్యలు తీసుకుని గ్రామస్తులు అన్నదమ్ములుగా కలిసి ఉండేలా చూడాలన్నారు. ఈ విషయాలు తెలిసిన వెంటనే జిల్లా అధికారులతో మాట్లాడి తగిన చర్యలు తీసుకోవాలని కోరగా అధికారులు శాంతికమిటీని ఏర్పాటు చేసి గ్రామాల్లో విద్వేషాలకు తావు లేకుండా సామరస్యంగా ఉండేలా చర్యలు తీసుకున్నారన్నారు. బాధిత కుటుంబానికి పార్టీ తరపున చేయూత నివ్వడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు.

కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు కొప్పన శివనాథ్, పిఠాపురం పట్టణ, మండల పార్టీ అధ్యక్షులు రావుల మాధవరావు, అడపా రఘు, నాయకులు గండేపల్లి బాబీ, కొత్తెం దత్తుడు, ఉలవల భూషణం తదితరులు పాల్గొన్నారు.